సాహిత్యోపన్యాసములు

19

5913-84

సరోజినీనాయుడు శత జయంత్యుత్సవ
సందర్భమున జరిగిన ఉపన్యాస సంకలనము.

Acc No 6629

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవన్ - సైఫాబాదు
హైదరాబాదు 4

SAHITYOPANYASAMULU - 19

Speeches delivered by Dr. C. NARAYANA REDDY, Prof. Department of Telugu, Osmania University, Hyderabad and SRI AMARENDRA, Guntur, on the Occassion of the Centenary Celebrations of SAROJINI NAIDU.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
హైదరాబాద్ - 500 004

ప్రచురణ : 315

ప్రథమ ముద్రణ : 1981

ప్రతులు : 1,000

వెల రూ : 1-25

ప్రతులకు :

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవన్, సైఫాబాద్,
హైదరాబాద్ - 500 004.

ముద్రణ :

పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్
హైదర్‌గూడ, హైదరాబాద్.

తొలి పలుకు

భారత స్వాతంత్ర్య సంగ్రామానికి నేతృత్వం వహించి తన కవితా జ్యోతిస్సులతో ప్రజా హృదయాలను ప్రజ్వలింప జేసిన మహాకవయిత్రిగా, భారత జాతీయ జీవితేతిహాసంలో శాశ్వతాదర్శంగా నిలిచిపోయిన "భారత కోకిల" శ్రీమతి ముత్యాల సరోజినీ నాయుడు శత జయంత్యుత్సవ సభను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి 27 - 1 - 1980 నాడు నిర్వహించింది.

ఆనాటి సమావేశంలో "సరోజిని నాయుడు కవితా ప్రతిభ"ను గూర్చి ఆచార్య డాక్టర్ సి. నారాయణ రెడ్డిగారు, "సరోజిని నాయుడు జీవితం-రచనల"ను గూర్చి డాక్టర్ అమరేంద్ర గారు ఉపన్యసించినారు.

ఆ ఉపన్యాసాలను పుస్తకంగా మలచి పాఠకలోకానికి అందించ గలుగుతున్నందుకు సంతోషిస్తున్నాము. ఆచార్య నారాయణరెడ్డి గారికి, డా. అమరేంద్ర గారికి అకాడమీ పక్షాన కృతజ్ఞతాభివందనములు అందజేస్తున్నాము.

హైదరాబాదు
17-1-1981

ఇరివెంటి కృష్ణమూర్తి
కార్యదర్శి

శ్రీమతి సరోజినీ నాయుడు కవితా ప్రతిభ

—డా॥ సి. నారాయణరెడ్డి

కాల్పనిక కవితాగంధం, జాతీయ భావానుబంధం, ప్రకృతి సౌందర్య సందర్శనం, పరమతాత్త్విక పరిచింతనం కలగలిపిన అక్షర భావచిత్రాలు శ్రీమతి సరోజినీనాయుడు ఆంగ్లకవితలు. సరోజిని కవితకు రసావేశమే జీవం. ఆ జీవం ఒక్కొక్కమాటు పదాల పరదాల మధ్య మిలమిలలాడుతూ వుంటుంది. ఒక్కొక్క మాటు విశేషణాల పరంపరల వెంట కరళ్ళు కరళ్ళుగా దూకుతుంటుంది. ఆమె కవితాప్రతిభ పొందిన క్రమ పరిణతిని ఆవిష్కరించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

జీవిత చిత్రం :

సరోజిని తరుణ యవ్వనదశలోనే ఒక తెలుగు బిడ్డను ప్రేమించింది. అతడు ముత్యాల గోవిందరాజులు నాయుడు. అప్పటికి ఆమె అతని కంటె వయసులో పదేళ్లు చిన్నది. సరోజిని ఇంట్లో తలిదండ్రులతో మాట్లాడే భాష బెంగాలీ హైదరాబాదులో ఉండడంవల్ల వచ్చిపోయే వాళ్ళతో మాట్లాడే భాష ఉర్దూ. పాఠశాలలో తాను చదువుతున్న భాష ఇంగ్లీషు. ఇంట్లో పనిమనుషులతో మట్లాడేది వచ్చీరాని తెలుగు. ఈ వాతావరణంలో పెరిగింది సరోజినీ నాయుడు ఆవిడకు తన 11వ యేట ఒక ఆల్జీబ్రా లెక్క ముడివిప్పవలసి వచ్చింది చాలాసేపు ఆలోచించింది. సమాధానం దొరకలేదు. చివరికి— ఆ లెక్క ముడివిప్పలేకపోగా గుండెలో ఎక్కడో ఒదిగివున్న కవితాధార పాతాళ గంగలా పైకుబికి వచ్చింది. ఆ తరువాత తన పదమూడో యేట 1300 పంక్తుల సుదీర్ఘ గీతం "Lady of the lake" రచించింది. తదుపరి ఒక సుదీర్ఘ నాటకాన్ని, ఒక నవలను వ్రాసింది.

1896 లోనే ఆమె మొదటి కవితా సంపుటిని ఆమె తండ్రిగారైన అఘోర్‌నాథ్ చటోపాధ్యాయ గారు ప్రచురించారు. అఘోర్‌నాథ్ నిజాం

కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉండేవాడు. గొప్ప మేధాసంపన్నుడు. అప్పటికే ఆయన ఆల్కెమీ (స్వర్ణీకరణ విద్య) గురించి పరిశోధనలు చేస్తున్నాడు. తన లాగే తన కూతురు కూడా గణితశాస్త్రంలోనో, విజ్ఞానశాస్త్రంలోనో విదుషీ మణిగా రూపొందాలని ఆయన కలలు కన్నాడు. ఆ కలలు ఫలించకపోయినా సరోజినిలో బాల్యంలోనే కవితాకళలు ఫలించాయి. క్రమంగా ఆమె ఆంగ్లకవితలు "The Golden Threshold"; "The Bird of time"; "The Broken wing"; "The Sceptred Flute"; "The Feather of the Dawn" అనే సంపుటాలుగా వెలువడ్డాయి. ఇంతకూ ఈ కవితా సంపుటాలన్నీ వెలువడింది 1915 లోపలే. ఆ తరువాత సరోజిని భారత రాజకీయ రంగస్థలం మీద అడుగు మోపింది. స్వాతంత్ర్య సమరాధినేత్రిగా రూపొందింది. కవయిత్రిగా కుబుసం విడిచింది. వీరసవిత్రిగా సరికొత్త పౌరుషాన్ని తొడుక్కుని ముందుకు సాగింది.

సరోజినిని కవయిత్రిగా సంభావించిన వాళ్ళు 'నైటింగేల్ ఆఫ్ ఇండియా' అన్నారు. 'బుల్ బులే హింద్' అన్నారు. అయితే ఆమె కవిత్వాన్ని గూర్చి తెలుసుకోవాలంటే ముందు ఆమె తొలినాళ్ళ జీవితాన్ని చదవాలి. నాయుణ్ణి ప్రేమించిన సరోజిని ధోరణిని ఆమె తండ్రిగారు నిరసించారు. చిత్రమేమిటంటే అఘోర్‌నాథ్ శాస్త్రవేది, హేతువాది. అయినా అతడు ఆవిడ ప్రేమను ఒప్పుకోలేదు. ఈ దేశంలో వుంటే లాభం లేదని నైజాం ట్రస్టు నుంచి స్కాలర్‌షిప్ ఇప్పించి సరోజినిని పదహారోయేటనే పైచదువులకు ఇంగ్లండు పంపించాడు. ఆమె ఇంగ్లండులో ఉన్నప్పుడు కవిత్వాన్ని ఊపిరిగా భావించింది. కవిత్వంలో జీవించింది. షెల్లీ, కీట్స్ వంటి ఆంగ్ల కాల్పనికకవుల రచనల్లో మునకలు వేసింది. సరోజిని జీవితంలోని Romantic agony (కాల్పనిక వేదన) ఆమె కవిత్వంలో ప్రసరించింది. చేదు నిజాల నుంచి తప్పించుకుపోయే ఉడ్డీనగుణం పొడచూపింది. ఆమె తరుణ హృదయంలో చెలరేగుతున్న కల్లోలం ఆమె రచనల్లో ప్రణయావేశంగా, ప్రకృత్యారాధనంగా, ఆత్మార్పణతత్వంగా రూపుదిద్దుకున్నాయి.

నాలుగు సంవత్సరాల తరువాత సరోజిని స్వదేశానికి తిరిగి వచ్చింది. అఘోర్‌నాథ్ మనసు మార్చుకున్నాడు. సరోజినికి గోవిందరాజులు నాయుడుతో

మద్రాసులో బ్రహ్మసమాజ పద్ధతిలో పెళ్ళి జరిగింది. ఆ పెళ్ళి పురోహితుడు తెలుగుజాతికి హేతువాద భిక్ష పెట్టిన సంస్కరణ [illegible] వీరేశలింగం పంతులు.

తొలి రోజుల్లో సరోజిని రచనలపై ఆంగ్ల కావ్యాల ప్రభావం ఎక్కువగా ఉండేది. పాశ్చాత్యుల పూలూ, పక్షులూ అమితంగా ఆకర్షించేవి. నాటి ప్రముఖాంగ్ల కవి 'Edmond Gosse' ఆమెకు సలహా ఇచ్చాడు — [illegible] ఇంగ్లీషైనా వస్తువు, భావం స్వదేశీయ వాతావరణాన్ని చిత్రించేవిగా ఉండాలని. ఆనాటి నుంచి ఆమె కవిత తన తీరు మార్చుకుంది. తనలో [illegible] సాక్షాత్కరించుకుంది. హైదరాబాదు నగరవైభవాన్ని [illegible] లిల్లీలకు బదులుగా మల్లెలూ, గుల్‌మొహరులూ [illegible] నైటింగేల్స్‌కు బదులుగా కోకిలలూ, గువ్వలూ, చిలకలూ, [illegible] చోటు చేసుకున్నాయి. చేనేతవాళ్ళు, చేపలు పట్టేవాళ్ళు, [illegible] కవితావస్తువులుగా రూపుదిద్దుకున్నారు. 'యా అల్లా, యా అల్లా' వంటి మాటలు, 'కూ కుహూ-కూ కుహూ' వంటి కలస్వనాలు ఆమె [illegible] శ్రుతి చేసుకున్నాయి.

ప్రణయారాధన:

సరోజిని ప్రణయకవితల్లో ఆవేశం ఆత్మార్పణంగా అభివ్యక్తమవుతుంది.

"తీసుకో నా మేని కందలను
వేసుకో నీ యింటి ముక్కాలకు.
తలపుంటె నా నేత్రుచేదుకొని
తడుపుకో నీ తోటమొక్కలకు."*

ఈ పంక్తుల్లో ప్రణయమూర్తి పాదాలయెదుట సంపెంగ [illegible] సమర్పణ భావన తీవ్రాతితీవ్రంగా ధ్వనిస్తున్నది. ఈ పంక్తుల్లో అభివ్యక్తిపై ఉర్దూ కవిత్వ ప్రభావం ఉన్నది.

---

* ఈ వ్యాసంలో ఇచ్చిన తెలుగు ఉదాహరణలు సరోజిని [illegible] లకు నేన చేసిన అనుసృజనలు. అవి 'ముత్యాల కోకిల' అనే సంపుటిగా [illegible] వడ్డాయి

అచ్ఛమైన ప్రణయం ప్రతిఫలాన్ని అర్థించదు. ప్రణయజీవని తాను నశించినా తన ప్రణయం అక్షతమని భావిస్తుంది. ఈ దృష్టితోనే సరోజిని—అసలైన ప్రేమ ఏనాడూ అదరదు, ఎదురు తిరగదు అంటుంది. ఈ ప్రేమలో ఆరాధన ఉంది, అత్యంత దారుణ త్యాగమూ ఉంది. ఈ పంక్తుల్లో ఆ రెండూ గోచరిస్తాయి.

''ఓ ప్రియా నేను నీ యెదలోనె
ఒదిగి వుంటాను సుమలీలగా
కాకుంటె రగిలిపోతానులే
నీ కొరకు నరకాగ్నికీలగా.''

సరోజిని కవితల్లోని ప్రణయభావన ఒక్కొక్కప్పుడు కట్లు తెంచుకొనిపోయే ఉన్మత్త ప్రవృత్తిగా పరిణమిస్తుంది.

''ఓ ప్రియా నీవు రమ్మంటే
ఉన్నపాటున ఉరికిరానా
హరిణమ్ముకన్న ఉరవడిగా
విహగమ్ముకన్న వడివడిగా

....
నిప్పురెక్కలు కట్టుకున్న
మెరుపు పిడుగుల కన్న వడిగా
నీవు రమ్మంటె నే రానా.''

ఈ గీతంలోని ''నిప్పురెక్కలు కట్టుకున్న మెరుపు పిడుగులు'' అనే ప్రయోగం అత్యంత వినూత్నం.

విప్రలంభయోగంలోని వివిధావస్థల్లో మరణవరణం చరమదశ. కాల్పనిక కవిత్వంలో - ఇటు ప్రణయకవితల్లోనూ అటు తాత్త్విక కవితల్లోనూ - మృత్యువును నేస్తంగా, నెచ్చెలిగా ఆహ్వానించడం ఒక ప్రధాన లక్షణం. ఈ దృష్టిలో ప్రేమ, ప్రాపంచికసుఖాలకంటే అతీతమైన అనుభూతి. అదొక దివ్యగీతి.

ప్రణయభావ ప్రమత్తులను చీకటి, మృత్యువు నిరోధించలేవు. ఈ దృక్పథాన్ని సరోజిని ఇలా ప్రకటించింది:

''బ్రతుకు చీకటి అలలు పొరలినా
మృతి నిన్ను నన్ను విడదీసినా
ఏ విధి ఎలా తారసిల్లినా
నీవు రమ్మంటె నే రానా.''

ప్రకృతిప్రీతి :

కాల్పనిక కవిత్వ లక్షణాల్లో ప్రకృతిప్రీతి ఒకటి.అయితే ఇది పూలనూ, చేలనూ, మబ్బులనూ, వెన్నెలలనూ వర్ణించడంవరకే పరిమితం కాదు. ప్రకృతిలో మిరుమిట్లు గొలిపే సౌందర్యకణికలను వర్ణిస్తూనే అనుస్యూతంగా ఒక మానవీయ స్పర్శనూ, ఒక తాత్త్వికచ్ఛాయనూ ప్రసరింపచేయడం ఇందులోని విశేషం. 'బంగారు విరులు' (Golden Cassia) అనే శీర్షికతో వ్రాసిన కవితలో సరోజిని ప్రకృతి సందర్శనం విలక్షణంగా భాసిస్తుంది. అడవిపువ్వులని అందరనుకునే ఆ బంగారు విరులు ఆమె కవితాదృష్టికి నేలపై పడిన చుక్కల తునకలు. అప్సరోనిలయంలో అపరంజి దివ్వెలు. అమృతపూర్ణ హైమ కలశాలు. అంతేకాదు-

''తన కన్నెతనమునే తలపోసి ఒక పెండ్లి
పడుచు చిందిన రుచిర బాష్ప కణికలో?''

పెళ్ళికూతురు దశ విచిత్రమైంది. ఒక నీడలోంచి మరో నీడలోకి పరిణతి పొందే అవస్థ అది. ఆ పెళ్లికూతురు కన్నీళ్ళలో కరిగిన గత స్మృతులున్నాయి, విరిసే భవితవ్య స్వప్నాలున్నాయి. సరోజిని చిందించిన ''రుచిర బాష్పకణికలు'' అలాంటివే.

సరోజిని ప్రకృతికవితల్లో 'గోరింటాకు' పరమ సుకుమార రచన.

''గోరింట కొనరెమ్మలోన
కో అంది ఒక కోకిలమ్మ
రారండి ఓ చెలియలారా !
రండి గోరింటాకులేర''

అంటూ ముగ్ధరమణీయంగా మొదలైన కవిత చిక్కని కొసమెరుపుతో ఇలా ముగుస్తుంది :

''వధువు నెన్నుదుటికి కుంకుమం ఎరుపు
మధురాధరాలకు తాంబూల మెరుపు.
లిల్లీల తలపించు కాళ్ళకూ వేళ్ళకూ
లేత గోరింటాకు ఎరుపే ఎరుపు.''

నగరజీవితంతో, నతులతో స్తుతులతో విసుగెత్తిన సరోజిని కవితాంత రంగం వసంతవనుల్లో విహరించాలని కోరుకుంది.

''విసుగెత్తె నాకు వన్నెల ఇంటి కప్పులన్నా
మిసిమి మెత్తని పట్టుపరుపులన్నా''

అంటూ ఘోషించింది. గుల్‌మొహర్ రాగరంజిత గుచ్ఛాలవైపూ, జ్వాలికలుగా కుట్మలించే రేలచెట్లవైపూ ఎగిసిపోవాలని సంభ్రమించింది.

''మల్లె తీగలకు మన కళ్ళు ముడివేసుకుని
చల్లగా పలికించుదాములే సరికొత్త వేణువులు''

అంటూ స్వప్నగీతాలు ఆలపించింది. ఇలా ప్రకృతిలోకి ఎగిసిపోవడం కూడా కాల్పనిక గుణమే. ఇది షెల్లీ, కీట్స్ కవితల్లో బహుళంగా కనిపిస్తుంది.

''కూడి రా ప్రియతమా నాతో
కోకిలలు పిలుచు విరికోనలకు''

అన్న సరోజిని పంక్తుల్ని చూస్తుంటే ''ప్రేయసి లేచిరమ్మ చిగురించిన తోటల లోన'' అన్న అబ్బూరివారి పద్యపాదం గుర్తుకొస్తుంది.

అయితే ఒకానొక సౌందర్య పారావారంలో, స్వాప్నిక తీరాలలో సంచరించినప్పుడే సరోజినిలో కాల్పనికత వెల్లివిరుస్తుంది. ఒక్కొక్కమాటు వాస్తవికత పైకొనగా కాల్పనికతను నిరసిస్తుంది కూడా.

''తరలి పోపోంది గంధర్వ భావనలార
తెలిమబ్బుల ఎడారి తీరాలలోకి''

అంటూ స్వాప్నిక దృష్టిపట్ల తన విముఖత వ్యక్తం చేస్తుంది.

దేశీయత :

పల్లకీ బోయీల గురించి, చేనేతవాళ్ళను గురించి, గాజులవాళ్ళ గురించి, వీధి గాయకుల గురించి సరోజిని వ్రాసిన కవితల్లో దేశీయత ఎంతో వాస్తవికంగా, ఆత్మీయంగా రూపు దిద్దుకుంది. "పల్లకీ బోయీలు" కవితలో ఎంతటి వాస్తవికత ఉందో అంతటి సౌందర్య దార్శనికత ఉంది. పల్లకిలో ఉన్న పెళ్ళిపడుచు పువ్వులా, గువ్వలా, చిరునవ్వులా ఉంది. పల్లకీ బోయీలు ఆ ముదితను ముచ్చటగా, మురిపెంగా మోస్తున్నారు. ఆమె బోయీల పాటలో చుక్కలా వాలింది. వెలుగురేకలా మెరిసింది. ఈ గీతంలోని కొసమెరుపు ''కురిసెనామె కొత్త పెళ్ళికూతురు కన్నీరులా''. ఆ పెళ్ళిపడుచునే కన్నీటికి ప్రతీకగా చిత్రించడం ఈ కవితలోని విశేషం. ఈమె పల్లకీ బోయీలపై వ్రాసిన గీతం ప్రభావం కృష్ణశాస్త్రిగారి 'పల్లకీ' అనే కవితపై ప్రసరించింది.

చేనేతవాళ్ళను గురించి ఆమె వ్రాసిన కవితలో వస్తుపరిశీలనంతో పాటు తత్వావిష్కరణం కూడా కనిపిస్తుంది. ఈ కవితలో తొలి సందెలో, మలి సందెలో, చలి వెన్నెల్లో వస్త్రాలు నేసే చేనేతవాళ్ళకు వేసిన ప్రశ్నలూ, వాళ్ళిచ్చే సమాధానాలూ ఎంతో ఉదాత్తంగా రూపుదిద్దుకున్నాయి.

ప్రశ్న : 'ఈ ప్రభాతవేళ ఇంత మురిపెంగా
ఈ వలువలు మీరెందుకు నేస్తున్నారు?'

సమాధానం : 'నీలి హంస రెక్కలనే తలపించే
నెరవలువలు పసిబిడ్డకు నేస్తున్నాము.'

ప్రశ్న : 'ఈ మలిసందెలో ఇంత అందంగా
ఈ వలువలు మీరెందుకు నేస్తున్నారు?'

సమాధానం : 'పలువన్నెల నెమిలి కనుల తలపించే
పట్టుచీర కళ్యాణికి నేస్తున్నాము.'

ప్రశ్న : 'ఈ చలివెన్నెల్లో ఇంత మౌనంగా
ఏమిటది? మీరేదో నేస్తున్నారు?'

సమాధానం : 'వెలిమబ్బుల తెలియీకల తలపించే
వలువ శవాలంకరణకు నేస్తున్నాము.'

ఆ మూడు వేళల్లో మొదటి దశలో నేసే వలువలు పసిబిడ్డకు. రెండో దశలో నేసే పట్టుచీర పెండ్లి పడుచుకు. మరి మూడో దశలో నేసే వలువ శవాలంకరణకు. చేనేత వలువల రూపంలో సరోజిని బాల్య యవ్వన మరణావస్థలను సుందరంగా, తత్వ బంధురంగా సూచించింది. ఒక్కొక్క దశలో నేస్తున్న వలువకు ఒక్కొక్క విలక్షణ విశేషం పొదిగింది. పసిబిడ్డకు నేసే వలువ నీలిహంస రెక్కలను తలపించేది. కళ్యాణికి నేస్తున్న వలువ నెమిలి కనులను తలపించేది శవాలంకరణకు నేస్తున్న వలువ తెల్లని మబ్బులీన్ని తెల్లని ఈకల్ని తలపించేది. ఇలా రంగుల ద్వారా వాస్తవికతను ఆవిష్కరించడం వల్ల ఈ కవితకు ఎంతో ఉదాత్తత అలవడింది.

ఈ శ్రేణికి చెందిన మరో రెండు గేయాలు జంగమ గాయకులు (Wandering singers), తెండి సోదరులారా! (Coromandal Fishers). తంబురాలు మీటుకుంటూ తిరిగే జంగమ గాయకులను ఏ ప్రేమా ఆపదు, ఏ హాయీ ఆపదు. వాళ్ళకు ఏ ఆశలూ లేవు, ఏ కలలూ రావు. పొగ చూరిన నగరాలే వాళ్ళ నెలవులు, తెమ్మెర పిలుపే వాళ్ళ విధిని తీర్చే పిలుపు.

'గాజులవాళ్ళు' అనే గీతంలో ముద్దుబిడ్డలు మొదలుకొని ముదివగ్గుల వరకు గాజుల ఉపయోగాన్ని వివరించింది. పెళ్ళిపడుచు తొడుక్కునే గాజుల గురించి ఇలా అంటుంది-

''కిలకిలలాడే ఆమె నవ్వులివి
జలజలకురిసే ఆ కన్నీళ్ళివి.''

ఇందులో రెండు దశలున్నాయి. అవి ప్రియుని సమీపంలో ఉన్నప్పుడు కలకలా నవ్వుతాయి. విభుడు ప్రవాసంలో ఉన్నప్పుడు జలజలా కన్నీళ్ళు కురుస్తాయి.

స్థానిక ముద్ర ;

హైదరాబాద్ నగర పరిసరాల ప్రభావంతో ఆమె వెలువరించిన కవితలు 'హుసేన్ సాగర్', 'యా అల్లా, యా అల్లా', 'అసూర్యంపశ్య', 'గోలకొండ రాచగోరీలు'.

హుసేన్‌సాగర్ కవితలో ఆ సాగరం బాహిరసౌందర్యానికి అందరూ ముగ్ధులవుతారని, ఏ ఒక్కరూ లోనిశోభలను కనుగొనలేరని అంటుంది. తరుణ భానుడు బులిపించినా, జలధరాలు కమ్ముకున్నా ఆ సాగరహృదయం పరవశించదు. గాలి చెలికాని కొనవ్రేలి తాకిడితోనే ఆ హృదయంలో రక్తిమ తళుకొత్తుతుంది. ఆ కెరటాలలోని స్వచ్ఛ సంగీతం ఆ సమీరస్పర్శ కోసమే. ఈ కవితలో కూడా ఒక కొసమెరుపుంది.

> ''నా వలెనె కట్టువడి
> నా వొకే విశ్వాస సూత్రాన
> ఓ సరోవరమా !
> ఓ సజీవ మదాత్మబింబమా !''

ఈ పంక్తుల్లోని విశ్వాససూత్రం సరోజిని తరుణయవ్వనంలో కలిగిన అచ్ఛిన్న ప్రణయ సూత్రమే.

'యా అల్లా యా అల్లా' అంటూ హైదరాబాద్ నగరవీధుల్లో తిరిగే బిచ్చగాళ్ళను గురించి వ్రాసిన గీతంలో సరోజిని ప్రకటించిన తాత్విక దృక్పథం మననరమ్యంగా ఉంది.

> ''కాలమో ప్రవహించు గాలి
> భావి ముకుళించిన గులాబి.
> ఎవడు తుంచునో ఎవరికెరుక
> యా అల్లా యా అల్లా.''

ఒకనాడు మహోజ్జ్వలంగా వెలుగొంది ఇప్పుడు కొడిగట్టి మిగిలివున్న రాచగోరీలను గురించి సరోజిని వ్రాసిన కవితలో చరిత్ర ఆవులింత ఉంది.

వర్తమానానికి కలిగిన పులకింత ఉంది. ఆ ఈటెల సవ్వడులు లేవు, ఆ రమణుల నవ్వులు లేవు. విధి ఆ శ్రుతకీర్తిని విస్మృతకేళికి బలి కావించింది. ముదిసిన విధి ఆ రాణుల విరిమేనులను గోరీలకు అప్పగించింది. ఆ పరిపాలనకథలూ, ఆ రాణుల లావణ్యద్యుతులూ విస్మృతిగర్భంలో కలిసిపోయినా, వాటి అనుభూతి తలచుకుంటే ఇంకా ఇంకా మిగిలే వుంది. ఈ కవితలోని తుదిజిలుగు ఇలా ఉంది. అది రాణులను ఉద్దేశించింది.

> ''ప్రతి వసంతకోకిల మీ
> ప్రణయగీతులను పాడును.
> దానిమ్మల లేపగ మీ
> తరుణిమ నిద్దుర వీడును.''

పరదా మాటున ఉన్న తరుణిని గూర్చి వ్రాసిన కవిత 'అసూర్యం పశ్య'. 'పర్దానషిన్' అనే ఉర్దూపదాన్నే సరోజిని ఈ కవితకు శీర్షికగా గ్రహించింది.

> ''ఆమె బ్రతుకు ఏకాంతంలోన నలిగి
> అలసిసొలసి చంక్రమించు తీయని కల''

అంటూ ఎత్తుకోవడంలోనే మొత్తం కవితాత్మ ముడివడిపోయింది. ఆమె సమలంకృతంగా ఉంది. సురక్షితంగా ఉంది. ఆవిడ మేలిముసుగును తొలగించ డానికి ఏ అధర్మహస్తం తెగించలేదు. అయినా ఆమెకు మిగిలినవి అశ్రువులే. ఆ అశ్రువులు తుడిచేవారెవరు అనే ప్రశ్నతో ఈ కవిత గభీరంగా నిట్టూరుస్తుంది.

జానపద ముద్ర :

ఆంగ్లకాల్పనికకవిత్వం గుప్పిటినుంచి విడివడిన సరోజిని గళం జానపదముద్రను లోగొన్న గీతాలను పలికించింది. గోరింటాకు (In praise of Henna), విసుర్రాతి పాట (Corn-Grinders), ఒంటరి పాప (The lonely child), జోలపాట (Cradle song)-ఈ కోవకు చెందినవే. విశేషణాల దొంతరలతో, భావచిత్రాల మంజరులతో, ప్రణయావేశ పరంపర

లతో ఎన్నెన్నో గీతాలు పలికించిన సరోజిని తనను తాను ఎంతగా కుదించుకుని నిసర్గ రమణీయంగా పలుకుతుందో ఈ తరహాకు చెందిన గీతాలు చెబుతాయి.

''గోరింట కొనరెమ్మలోన
కో అంది ఒక కోకిలమ్మ
కూ కుహూ కుహు కుహూ''

జానపద శైలిలో రూపొందిన అచ్చమైన తెలుగుపాట పల్లవిలా ఉంది.

''రారండి ఓ చెలియలారా
రండి గోరింటాకులేర''

ఆ పల్లవికి అనుపల్లవిలా కుదిరిందిది. ఇలా సరళ సరళంగా సాగిపోయిన ఈ పాటలో చివరి చరణం తీయని అభివ్యక్తికి ఆభరణం.

''వధువు నెన్నుదుటికి కుంకుమం ఎరుపు
మధురాధరాలకు తాంబూల మెరుపు
లిల్లీల తలపించు వేళ్ళకూ కాళ్ళకూ
లేత గోరింటాకు ఎరుపే ఎరుపు''

'విసుర్రాతిపాట' అచ్చమైన జానపదుల కథకు ఆంగ్ల గీతానువాద మేమో అనిపిస్తుంది. ఆ ప్రశ్న, ఆ సమాధానం, ఆ సంబోధన, ఆ నిర్వహణ, ఆ పాదపునరుక్తి, ఆ క్లుప్తమైన అభివ్యక్తి-ఈ గీతాన్ని చక్కని జానపద గీతంగా తీర్చిదిద్దాయి.

''ఎందుకని అరిచేవు ఓసి చిట్టెలుకా!''- ఇది ప్రశ్న.

''ఏమందు నా రాజు ఇక నాకు లేడు''- ఇది సమాధానం. అలాగే లేడి కూనను ప్రశ్నించడం-అదే సమాధానం. అలాగే పెళ్ళి పడుచును ప్రశ్నించడం-అదే సమాధానం.

చిట్టెలుకరాజు చిట్టిజొన్నలాశించి పెదరైతు పంటలోగిలికి వెళితే వల పన్ని పట్టుకుని మట్టుపెట్టారు. లేడిరాజు నీటికోసం ఏటిగట్టుకు వెళితే పొంచి

ఖున్న వేటగాడు చంపేశాడు. చిట్టెలుకకూ, కన్నెలేడికీ కలిగిన దయనీయస్థితిని వర్ణించిన సరోజిని చూపు విలపిస్తున్న పెళ్లిపడుచును ప్రశ్నించింది. ''ఎందుకని ఏడ్చేవు ఓ పెళ్ళిపడుచా" అని. ఈస్థితి పరమ దారుణమైంది. పెళ్లైనరోజే ఆవిడ పతి అస్తమించాడు. ఆ అనాథ అన్న ఈ చివరి మాటలు కరుణ రసావిష్కృతికి గీటురాళ్ళు.

''ఏ చిచ్చు నా ప్రియుని చితిని కాల్చిందో
ఆ చిచ్చు నా గుండె రగిలించెనమ్మా !''

ఒంటరి పాప (The Lonely child) అనే గీతంలో అమ్మా నాన్నా, తోడూ జోడూ ఎవ్వరూ లేని ఒక బుజ్జిపాప ఆవేదన అగుపిస్తుంది.'ఓ చుక్కా ! నాకు నువ్వు అమ్మవవుతావ? ఓ గాలీ! నువ్వు నాకు అన్నవవుతావ?' అంటూ జాలి జాలిగా బేలబేలగా ప్రశ్నిస్తుంది పాప. ఒంటరితనంలో తానెంతగా వణికి పోతుందో చెప్పుకుంటుంది. పాపలంటే దేవునికి ప్రేమంట, నా పిలుపులను వినే వాణ్ని ఆ దేవుడు పంపిస్తే ఎంత బాగుండేదని బావురుమంటుంది. గువ్వలకూ, పువ్వులకూ తోడుంది. ఎలకలకూ, ఉడతలకూ తోడుంది. తనకు మాత్రం తోడు లేదని వాపోతుంది ఈ గీతంలోని చివరి పంక్తులు గుండెల్ని తరుక్కుపోయే జాలి చరుపులు.

''చీకట్లో నను గుండె కద్దుకుని
చెవిలోన ముచ్చట్లు చెప్పేటి
అమ్మ నాకెంతో కావాలనీ
ఆ దేవుడే మరిచెనెందుకని ?''

తెలుగు జానపద గీతాల్లో 'జో అచ్యుతానంద జోజో ముకుందా' 'ఏడువకు ఏడువకు యెర్రి నా తండ్రీ !' మొదలైన జోలపాటలు ప్రసిద్ధంగా ఉన్నాయి. వీటిలో పాపనో బాబునో నిదురపుచ్చడం వస్తువు. సరోజిని రచించిన జోలపాట (Cradle Song) ఈ తరహాకు చెందిన గీతమే.

''ముద్దు పాపా కళ్లు
మూసుకో హాయిగా''

ఆనడం జానపదగేయ లక్షణమే. కానీ నీకోసం ఒక కలను తెచ్చాను ఆనడం ఈమె విశిష్ట భావుకతాగుణం. ఆ కల ఎలాంటిది ?

"వరి చేలనుంచి కొతి
మెర చేలనుంచీ
విరిసేటి తామరల
చెరువుల్లనుంచీ
మంచులో తడిసిన
మా మంచి కల."

అంతేనా మరి ! "పొదరింట దాగిన ముత్యాల కల కూడా." ఆ కలను మురిపెం పాప నీలికళ్ళపైన ముద్ద మురిపెంగా అద్దుతాననడం సహజతనూ, రమ్యతనూ ఒడుపుగా ముడివేయడం.

జాతీయోద్యమ ప్రభావం:

విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేసి ఈ దేశానికి తిరిగివచ్చిన తరువాత శ్రీమతి సరోజినీ నాయుడు జాతీయోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నది. గాంధీజీ, గోఖలే, తిలక్ వ్యక్తిత్వాల ప్రభావం ఆమెపై సాంద్రంగా ప్రసరించింది. ఆంగ్లకవయిత్రి స్వరాజ్య సమరాధినేత్రిగా రూపొందింది. జాతీయోద్యమ ప్రభావంతో ఆమె కొన్ని కొత్త కవితలు రచించింది. వాటిలో భిన్నమత సఖ్యం, జాతీయ సమైక్యం, దేశమాతృ ప్రబోధం, దేశనేతృ ప్రశంసనం ఇతివృత్తాలైనాయి. 'మేలుకో మా తల్లి !' (Awake) అనే గీతంలో ఉన్న తల్లి ఆరోజుల్లో 'వందేమాతరం'గా కీర్తింపబడిన భారతమాతే. ఈ గీతం మతసఖ్యానికి రచించిన మహస్పతునక. తల్లి ఒకరే, బిడ్డలు వేరు వేరు. అందరూ ఆ మహాత్మకు వారసులే. ఆ తల్లి యశోగాథ చుక్కలంటే దాకా వినిపిస్తామనీ, ఆ మాతృమూర్తిని ఆసదృశవైభవశిఖరాగ్రాలపైన నిలుపుతామనీ పిడికిలెత్తి ప్రతిన చేసినవారే. వారు భిన్నభిన్న మతాలకు చెందినవారు. వారిలో హిందువులు ఆమె నభిషేకించడానికి పూజాసుమాలు తెచ్చారు. మహమ్మదీయులు ఆమెను రక్షించడానికి ప్రేమఖడ్గంతో వచ్చారు. క్రైస్తవులు

ఆమెను కీర్తించడానికి విశ్వాసగీతితో వచ్చారు. అన్ని మతాల గొంతుకలు కలిసిన ఒకే ప్రతిజ్ఞాశ్రుతి ఇలా సాగుతుంది చివరికి:

"భయరహితమైన మా
భక్తి నీ సేవకొరకే.
వినుము ఓ జనని మా
పిలుపు నీ ప్రణతి కొరకే."

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో హిందూమహమ్మదీయాది భిన్నమత స్థులు ప్రదర్శించిన ఏకతాముద్ర ఈ గీతంలో కవితాత్మకంగా భాసిస్తుంది.

ఒకే హృదయం (An Anthem of Love) అనే గీతంలో కూడా మానవతా మహితమైన మతసఖ్యతే కనిపిస్తుంది. ఈ గీతంలోని జనని భారతావనియే. ఇందులోని రెండు చేతులూ, రెండు అడుగులూ, రెండు వీనులూ, రెండు కనులూ హిందూ మహమ్మదీయులవి. అవి రెండైనా వాటిని ఒకే లక్ష్యం ముడివేస్తుంది. అందువల్ల జననిని స్మరించే హృదయం మాత్రం ఒక్కటే.

"ఒకే హృదయం మాది జననీ
ఒకే హృదయం" అన్న తుది పలుకుల్లో ఆ మతైక్యతా ప్రబోధం అగుపిస్తుంది.

లోకమాన్య తిలక్, గోఖలే స్మృత్యంకంగా ఆమె రచించిన గీతాల్లో జాతీయోద్యమస్ఫూర్తి స్ఫుటంగా కనిపిస్తుంది. ఈ గీతాల్లో ఆమె చేసింది శ్రద్ధాంజలిని సమర్పించడమో, వారి గతకీర్తిని స్తుతించడమో మాత్రమే కాదు. గోఖలే గురించి వ్రాస్తూ ఆమె సూటిగా ప్రశ్నిస్తుంది-

"అవసరమా నీకిక శ్ర
ద్ధాంజలులూ, సంస్మృతులూ" అంటూ.

గోఖలే చేతినుంచి జారిపడిన కాగడాను చేపట్టి చితిచుట్టూ నిలిచివున్న దుఃఖసంతప్తులు తమ ఆత్మలను వెలిగించుకోవాలని ప్రబోధిస్తుంది.

తిలక్ గురించి రచించిన స్మృతిగీతంలో తిలక్‌ను వీరసైనికుడుగా, ఋషివరుడుగా సంస్తుతిస్తూ, అతని మరణం తమకు ఎలా మార్గదర్శకంగా ఉండాలో ఈ మాటల్లో చెబుతుంది.

"పటు విమోచన శిఖల ప్రజ్వరిల్లెడు నీ చి
తాభస్మమౌను మా తరమునకు వరముగా."

భావుకత :

ఏ కవికైనా రెండు గుణాలు అనివార్యం. ఒకటి దర్శనం, మరొకటి వర్ణనం.

"దర్శనాత్ వర్ణనా చ్చాధ
రూఢాలోకే కవిశ్రుతిః"

అంటాడు భట్టతౌతుడు. దర్శనమంటే కేవలం చూడడం కాదు, వస్తువు పొరలు విప్పిచూడడం. సంఘటనల పురులు విప్పిచూడడం. చూసినదాన్ని నెమరు వేసుకోనడం. నెమరేసుకున్నది అక్షరాలా పురుడు పోసుకోవడం. దృష్టి అప్పుడు సృష్టిగా మారుతుంది. దర్శనం వర్ణనంగా రాగిల్లుతుంది.

దృష్టి సృష్టిగా మారడానికి ఆవేశం మూలధాతువు. ఏ కళావిర్భూతికైనా ఇది మౌలిక సత్యం. "True Art cannot exist without emotion" అని Goethe అన్నది ఈ దృష్టితోనే. సరోజినిలో ఈ ఆవేశం పాలు అధికం. 'బహూమతి' (Guerdon) అనే కవితలో ఆమె ఆవేశం ముమ్మొనవాలుగా ప్రకాశిస్తుంది. 1. ప్రణయావేశం 2. సత్యావేశం 3. కవితావేశం. ఆమె కవితలన్నిటిలో ఈ ఆవేశత్రయం ముప్పిరి గొన్నది. అయితే ఒక్క ఆవేశముంటేనే చాలదు. అందుకు తగిన భావుకత, అనుభూతి తీక్షత, అభివ్యక్తిచతురత కావాలి.

"ఝుమ్మనే తుమ్మెదల మొయిలు లార" అనడం "కలికి ఆకుల ఎల తుఫాను లార" అనడం భావుకతకూ, ప్రబలమైన అభివ్యక్తికీ ఉన్న అవినాభావతను ఎత్తి చూపడం.

"వెన్నెల రెక్కలపై హిమబిందు లలిత నృత్యం"- రెండు భావ చిత్రాలను సున్నితంగా రంగరించడం.

"ఓ సరోవరమా

ఓ సజీవ మదాత్మబింబమా" అనడం ఆకాశాన్ని అద్దంలో చూపడం.

"మృతస్వప్నం" అనే కవితలో స్వప్నాన్ని హిమాటవుల్లో లోతుగా పూడ్చడమే ఒక వినూత్న భావన. ఇది గతించిన స్వప్నానికి చేసిన రూప కల్పన.

"వసంతంలో పూచిన ఎర్రని పూలు నా యెదపాదున పూచిన గాయాలకు అనుకరణలు కావా" అని ప్రశ్నించడం తీవ్ర భావుకతకు దీపం పెట్టడం. అసలు వసంతమే తన సృష్టికి అనుకృతి అనడం పరమమధుర వ్యంగ్యానికి పట్టం కట్టడం.

సరోజిని కవితల్లోని కొన్ని సూక్తులు కవిత్వం జీరను అంటుకుని పుడతాయి. మత్స్యకారుల దృష్టిని ఆవిష్కరిస్తూ ఆమె ఇలా అంటుంది-

"జలరాశి మన తల్లి జలధరుడె సోదరుడు
కేలెత్తి పిలుచు కెరటాలె మన నేస్తాలు"

నురగచేతులు, దాప్పొలయం, ఎరుపు మెరుపు జల్లులు, వెండి రెక్కలు వంటి పదబంధాలలో మాటలతో అందమైన బొమ్మలు కట్టే సరోజిని ప్రతిభ గోచరిస్తుంది.

"జడవిధి ఒక కుడ్యం" అన్నప్పుడు ఎదుట నిలిచిన నిలువెత్తు చిత్రం కొత్తదనాన్ని కొలబోసుకుంటుంది.

"స్వీకరించుము ఓ ప్రియతమా
నా కపలనే మణులపోలిక"

అన్నప్పుడు విలక్షణంగా చెప్పేగుణం లలిత లలితంగా అగుపిస్తుంది.

సరోజిని కవితల్లో మృత్యువరణం వుంది; మృత్యు నిరసనమూ ఉంది.

''ఆగవే మృత్యువా ఆగు
అప్పుడే మరణించలేను''

ంటూ మృత్యువును నిలదీయడంలో ఆశావాదం అంచులు ముడుతుంది. నిజం
నే సరోజిని కవిత్వం, వ్యక్తిత్వం మృత్యువుకు అతీతంగా మిగిలిపోయిన
తన్యనిధులు. ఆమె కవయిత్రి, స్వాతంత్రోద్యమాధినేత్రి, వక్తృత్వమూర్తి.

''అందుకే ఆ త్యాగమూర్తిని కవితాస్ఫూర్తిని
గోఖలే గురుహృదయం ఆశీర్వదించింది.
గాంధీజీ అమృతవాణి అభినందించింది.
జవహర్ స్నిగ్ధమతి ఆత్మీయంగా అభినందించింది.''*

* ముత్యాల కోకిల vii

భారతకోకిల సరోజినీదేవి

జీవితమూ సాహిత్యమూ

(ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో
27-1-80 నాడు చేసిన ప్రసంగ సారాంశం)

—అమరేంద్ర

ఒకనాటి ప్రభాత శుభసమయం. శాంతినికేతన సుందర తరుచ్ఛాయలలో తరుణారుణ కిరణకాంతులలో విహంగ కలకలరావంలో ఒక అపూర్వ సన్నివేశం. చాలాకాలం తరవాత కలుసుకున్న ఆప్తమిత్రులు గాంధీ రవీంద్రులు ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనంచేసుకున్నారు. ఆ సమావేశాన్ని కనులారా చూసి పులకించిపోయిన భారతకవికోకిల సరోజినీదేవి ''సత్యం సౌందర్యాన్ని కౌగిలించుకున్నది'' అన్నారు.

భారత భాగ్యవిధాత బాపూజీ స్వాతంత్ర్య దీక్షనూ, విశ్వకవి రవీంద్రుని సౌందర్యపిపాసనూ ఉత్తమ వారసత్వంగా అందుకొన్న విశిష్టమూర్తి సరోజినీదేవి. కమనీయ వంగ వంగడమును మూర్తిలో ప్రసరించిన పసిడిబొమ్మ; స్వాతంత్ర్య వీర విహార రంగంలో కోరి దూకిన తెలుగు కోడలమ్మ; ఆమె భారత స్త్రీలలో శిరోమణి. విశ్వవీథులలో భారతీయ కీర్తిచంద్రికలు విస్తరింపజేసిన కమనీయ కవయిత్రి సరోజినీదేవి. కవితారంగంలోనూ స్వాతంత్ర్య సమరాంగణంలోనూ అపారఖ్యాతిని సముపార్జించిన విశిష్ట వ్యక్తి సరోజినీదేవి.

సరోజినీదేవి హైద్రాబాదు నగరంలో ఫిబ్రవరి పదమూడు, పద్దెనిమిది వందల డెబ్బది తొమ్మిదవ సంవత్సరములో జన్మించారు. ఆమె తండ్రి అఘోర

నాథ్ చటోపాధ్యాయ తల్లి వరద సుందరీ దేవి. తండ్రి రసాయన శాస్త్రంలో విశేషమైన పరిశోధనలు జరిపి నిజాం కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ వుండేవారు. ఆయన పూర్వీకులు వంగదేశంలో ఉండే బ్రహ్మనగరంలో తత్త్వ వేత్తలుగా పకృతి సౌందర్యోపాసకులుగా ఆదర్శవాదులుగా ప్రఖ్యాతి పొందినారు. వరదసుందరీదేవి ఆదర్శ గృహిణిగా "వండనలయదు వేవురు వచ్చిరేని, అన్నపూర్ణకు నుద్దియౌ నతని గృహిణి" - అన్నట్లుగా అతిథి సత్కార మర్యాదలకు పేరు పొందినది. జానపద గీతాలు, పూర్వకవుల పదాలు ఆమె నాలుక మీద నాట్యం చేస్తూవుండేవి. అటువంటి వాతావరణంలో పుట్టిన సరోజినీదేవి తన పదకొండవ ఏటనే తొలిసారిగా కావ్య రచనకు ఉపక్రమించింది. తండ్రి ప్రోత్సాహంతో తన పన్నెండవయేట మెట్రిక్యులేషన్ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలై ప్రశంసలందుకొన్నది.

ఆమె పదమూడవ యేట ఆంగ్లభాషలో పదమూడు వందల పంక్తుల కథాకావ్యం విరచించి పాఠకులను ఆశ్చర్యచకితులను చేసింది.

పద్దెనిమిది వందల తొంబది ఆరవ సంవత్సరములో నిజాం నవాబు స్కాలర్‌షిప్పుతో ఉన్నత విద్యాభ్యాసంకోసం ఇంగ్లండు వెళ్లింది. అక్కడ కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన గర్టన్ కళాశాలలో చేరి విద్యావ్యాసంగము చేసి డిగ్రీ తీసికోకుండానే తన పద్దెనిమిదవయేట స్వదేశానికి తిరిగివచ్చింది. విదేశాలలో గడిపిన కాలంలో ఆమె ఆంగ్లకవితా రచన విరివిగాచేసి విమర్శకుల ప్రశంసలను అందుకోగలిగింది. ఆమె హృదయం వియోగవేదనతో సంతప్తమై విరహబాష్పాలు అక్షరరూపం ధరించాయి.

స్వదేశానికి తిరిగివచ్చిన తరువాత సరోజినీదేవి ప్రణయమార్గంలో ఎదురైన ప్రతిబంధకాలు తొలగిపోయాయి. తలిదండ్రుల ఆమోదంతో ఆమె తాను వలచిన ముత్యాలగోవిందరాజులు నాయుడు గారిని వివాహం చేసుకున్నారు. ఇది వర్ణాంతర, రాష్ట్రాంతర వివాహం. సంకుచిత పరిధులను అతిక్రమించిన ప్రణయశక్తికి ఘన విజయం. ఈ వివాహానికి నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులుగారు మద్రాసు నగరంలో పౌరోహిత్యం వహించి శుభాశీస్సులను అందించటం గొప్ప విశేషం.

సరోజినీదేవి జీవిత చరిత్ర భారతజాతి చరిత్రతో పెనవేసుకుపోయింది. గాంధీ మహాత్ముడు భారత దేశానికి రాకపూర్వమే సరోజినీదేవి జాతీయోద్యమాలలో పాల్గొని అగ్రశ్రేణి నాయకమణిగా పేరు సంపాదించుకొన్నారు. సుమారు పది సంవత్సరాలు గోపాలకృష్ణ గోఖలే నాయకత్వంలో ఆమె పనిచేసి మాతృభూమికి తన జీవితాన్ని పూజాప్రసూనంగా సమర్పణ చేసికోవాలని నిర్ణయించుకొన్నారు. కవితాశక్తిని, ప్రసంగ కౌశల దీప్తిని, దేశదాస్య విమోచనంకోసం సాధనాలుగా వినియోగించాలని గోపాలకృష్ణగోఖలే ఆమెకు ప్రబోధించారు. పంతొమ్మిదివందల పదిహేనవ సంవత్సరములో ఆమె తండ్రి అఘోరనాథఛటోపాధ్యాయ, ఆమె రాజకీయగురువు గోఖలే పరమపదించారు. లండన్ నగరంలో మొట్టమొదటి సారిగా పంతొమ్మిది వందల పదునాలుగవ సంవత్సరములో సరోజినీదేవి మహాత్మ గాంధీని కలుసుకొన్నారు. ఆయన అహింసావాదము, సత్యవ్రతము ఆమెను గాఢంగా ఆకర్షించాయి. గాంధీజీ భారతరాజకీయ రంగంలో ప్రవేశించిన తరువాత ఆయన సారథ్యంలో నడచిన ప్రతి ఉద్యమంలోను సరోజినీదేవి పాల్గొన్నారు. పంతొమ్మిదివందల ఇరవై ఐదవ సంవత్సరంలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష పీఠాన్ని అలంకరించారు. అప్పటినుంచి మహాత్ముని అడుగు జాడలలో నడుస్తూ గంగాప్రవాహ సదృశమైన వక్తృత్వంతో జాతి జనులను ఉత్తేజ పరుస్తూ సరోజినీదేవి నాయకమణిగా భాసించారు. గాంధీమహాత్ముని సత్యాహింసల విశిష్టతను పాశ్చాత్య ప్రపంచానికి చాటించటం కోసం పంతొమ్మిది వందల ఇరవై తొమ్మిదవ సంవత్సరంలో అమెరికా దేశంలో సంచారం చేశారు.

గాంధీమహాత్ముడు పంతొమ్మిదివందల ముప్పై సంవత్సరములో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమం ప్రారంభించి దండియాత్ర నడిపినప్పుడు సరోజినీదేవి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయనతోపాటు లండన్ నగరం వెళ్ళి పంతొమ్మిది వందల ముప్పై ఒకటవ సంవత్సరంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. తిరిగివచ్చిన తరువాత స్వాతంత్రోద్యమం నీరుకారిపోయి నిరాశానిస్పృహలు దేశంలో అలుముకొన్నప్పుడు సరోజినీదేవి తన ఉత్తేజకరమైన ప్రసంగాలద్వారా స్వాతంత్ర్యకాంక్షను ప్రజ్వలింపజేశారు.

క్విట్ ఇండియా ఉద్యమం, పంతొమ్మిది వందల నలభై రెండులో సుడి గాలిలాగా చెలరేగి జాతిని ఉద్రూతలూగించింది. ఆ సందర్భంలో గాంధీజీతో పాటుగా ఆగాఖాన్ భవనంలో సరోజినీదేవికూడా కొన్ని సంవత్సరాలు బందీగా ఉన్నారు. జాతీయ నాయకులను ద్వితీయ ప్రపంచ సంగ్రామంముగిసిన తరువాత విడుదల చేశారు. అప్పుడు చెలరేగిన మత విద్వేషజ్వాలలను చల్లార్చటం కోసం గాంధీజీ ఒంటరిగా పాదచారియై బయలుదేరినప్పుడు - సరోజినీదేవి ఆయన ఉద్యమ విజయంకోసం ప్రార్థనచేస్తూ ఒక అమృత గీతం రచించారు.

భారతస్వాతంత్ర్యం కనుచూపుమేరలో ఉన్న తరుణంలో మార్చి 23, 1947 నాడు ఆసియా దేశాల మహాసభ జరిగింది. ఆ సభకు సరోజినీదేవి అధ్యక్షత వహించి మహాకావ్య సదృశమైన ప్రసంగం చేశారు. భారతదేశం చిర కాలంగా వాంఛిస్తున్న శాంతి ఎంత సముజ్జ్వలమైనదో, సువిశాలమైనదో, సురుచిర మైనదో వివరించారు. గాంధీమహాత్ముని నాయకత్వాన్ని ప్రశంసిస్తూ "మా మహా నాయకుడు మానవ జాతి ద్వేషమువలన, క్రోధము వలన, సంఘర్షణ వలన అధఃపతనము చెందుతుందని ప్రేమ, క్షమ, కారుణ్యము, శాంతి వంటి ఉత్తమ ఆదర్శముల ద్వారా మానవజాతి సముద్ధరింపబడుతుందని ప్రపంచానికి చాటించాడు" అని ఉద్ఘాటించారు.

సరోజినీదేవి విశాలదృష్టిలో భారతదేశం అపార మానవధామం. ఈ ధామమునకు సముద్రములే ప్రాకారములు, ఆకాశమే ఆచ్ఛాదనము. ఈ మందిర ద్వారము స్నేహ పూర్వకముగా తెరచుకొని సుస్వాగతము నిరంతరము పలుకు చుండును. ఈ విధమైన భావనతో సరోజినీదేవి హిందూ ముస్లిమ్ సమైక్యత కోసం నిర్విరామంగా కృషి చేశారు. ఈ రెండు మతాల స్నేహ సహజీవనానికి ఆల వాలమైన హైద్రాబాద్ నగర సంస్కృతిని ఆమె కవితారూపంలో ప్రస్తుతించారు.

స్వతంత్ర భారతంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి గవర్నరుగా ఆమెను నియమించి భారతజాతి ఆమె విశిష్టసేవలను గుర్తించింది. గాంధీమహాత్ముని హత్య జరిగిన తరువాత కొద్ది మాసాలకే సరోజినీదేవి జీవన యాత్ర ముగిసింది,

1949 మార్చి 2వ తేదిన సరోజినీదేవి ఏడు దశాబ్దాలు నిండుగా జీవించిన తరువాత కన్నుమూసింది.

ఆమె విశిష్ట వ్యక్తిత్వం ఎందరినో ఆకర్షించింది. సరోజినీదేవిలో ఉన్న మేధాసంపద, కవితాకౌశలము, ప్రసంగవిన్యాసము, సంస్కృతీ వైభవము, హాస్యరస విన్యాసము ఎందరినో ముగ్ధులను చేశాయి. ఆమెలో ఉన్న శక్తులు ఇతరరాజకీయ వేత్తలలో ఉన్నట్లయితే భారతజాతివైభవము వర్ణనాతీతం కాగలదు అని ఆల్డస్ హక్స్లీ వ్యాఖ్యానం చేశారు. ఆమె నడయాడుతున్న విజ్ఞాన సర్వస్వమని, చైతన్య చిద్విలాసాలకు ఆలవాలమని ఎందరో ప్రస్తుతించారు. ఆమె ప్రసంగము ఒకసారి విన్నవాళ్లు ఆ మధురానుభూతిని జన్మలో మరచిపోలేరు. తరంగాలలాగా ఉప్పొంగివచ్చే వాక్య విన్యాసం, వీణా నిక్వణంలాగా ఝుంకరించే కంఠస్వరం శ్రోతలను పారవశ్యంలో ముంచివేసేవి. ఆమె ప్రతి ఉపన్యాసము ఒక కమనీయ కావ్యం. కవితారచనకు స్వస్తి చెప్పినప్పటికీ తుది ఊర్పుదాకా సరోజినీదేవి కవయిత్రిగానే జీవించింది. ఏది పలికినా ఏది రాసినా ప్రతి అక్షరము కవితాగంధంతో భాసించేది.

"భాగ్యవంతులు సిరిసంపదలతోను, వీరాధివీరులు శౌర్య పరాక్రమాలతోను నిన్ను పూజిస్తారు. కాని నేను నా కావ్యపారవశ్యంతో నిన్ను ఆరాధిస్తాను. జీవితంలో తారసిల్లిన విషాద సన్నివేశాలను నా విషాద రాగాలాపనతో విస్మరిస్తాను" అని తరుణప్రాయంలో శపథం పట్టిన సరోజినీదేవి తన ప్రతిజ్ఞను అక్షరాలా నెరవేర్చుకోగలిగారు. భారతదేశపు కుసుమలతా సౌరభాలను విహంగ కలకల రవాలను క్షేత్రలక్ష్మి విశిష్ట శోభలను పాశ్చాత్యులకు తన రచనలద్వారా సాక్షాత్కరింపజేసిన సౌందర్యతపస్వి సరోజినీదేవి. కావ్యరచన విరమించిన తరువాత తన జీవితమునే సుందర సురభిళ సముజ్జ్వల కావ్యంగా తీర్చిదిద్ది భారతమాత చరణసన్నిధిలో నీరాజనంగా నివేదించిన మహావ్యక్తి సరోజినీదేవి. ఆమె శతజయంతి మహోత్సవము మహిళాలోకానికి ఒక మేలుకొలుపు.

Rs 1-25
Acc. No